క్లుప్తంగా

గణతంత్ర వేడుకల్లో ఎన్‌సీసీ విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: దేశ రాజధాని న్యూఢిల్లీలో గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొని మంగళవారం నగరానికి వచ్చిన ఎన్‌సీసీ కేడెట్లకు ఎన్‌సీసీ గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్ రైల్వేస్టేషన్‌లో స్వాగతం పలికారు. పరేడ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారని తెలిపారు. ఈసందర్భంగా సీఓలు, ఆర్మీ సిబ్బంది, ఎన్‌సీసీ అధికారులు కేడెట్లకు అభినందనలు తెలిపారు.

మ్యారేజ్ బ్యాండ్ చిత్ర బృందం సందడి



పాత గుంటూరు: సుహాస్ హీరోగా నటించిన అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ చిత్ర బృందం మంగళవారం గుంటూరులో సందడి చేసింది. సినిమా విజయోత్సవ యాత్రలో భాగంగా కొత్తపేటలోని భాస్కర్ డీలక్స్ లో చిత్ర బృందం పాల్గొన్నారు. హీరో సుహాస్ కేక్ కట్ చేసి థియేటర్లో అభిమానుల మధ్య ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా హీరో సుహాస్ విలేకరులతో మాట్లాడుతూ చిత్ర విజయంతో గుంటూరు రావడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. కుటుంబ కథా నేపథ్యంలో చిత్రాన్ని ప్రతి ఒక్కరు చూడాలని కోరారు. కార్యక్రమంలో హీరోయిన్ శివాని, చిత్ర యూనిట్ పాల్గొన్నారు.

9న జిల్లాస్థాయి సూపర్ క్విజ్ బీ పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో ఈనెల 9న జిల్లాస్థాయి సూపర్ క్విజ్ బీ పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులోని పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రతి పాఠశాల నుంచి 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఒక టీంగా పాల్గొనాలని, ఏ సిలబస్‌లో చదువుతున్న వారైనా పాల్గొనవచ్చునని సూచించారు. పోటీ ప్రపంచంలో విద్యార్థుల్లో అపారమైన జ్ఞానాన్ని పెంపొందించినప్పుడే మంచి విజయాలు సాధించగలరని, అందుకు క్విజ్ ఉపయోగపడుతుందని తెలిపారు. విజేతలకు తొలి మూడుస్థానాల్లో రూ.ఐదు వేలు, రూ.మూడు వేలు, రూ.రెండు వేలు చొప్పున నగదు బహుమతులతో పాటు వీక్షకులకు ప్రత్యేక బహుమతి ఇస్తామని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ వై.రథినీచౌదరి మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 9వ తేదీ ఉదయం 8.30 గంటలకు పాఠశాలకు చేరుకోవాలని సూచించారు. వివరాలకు 99482 27362, 70130 19166 నంబర్లో సంప్రదించాలని తెలిపారు

చిన్నారులకు ఆటల పోటీలు



నగరంపాలెం: జిల్లాలోని బాల బాలికలు కలిసికట్టుగా ఆట, పాటలతో ఆనందంగా గడపడమే బాలమేళా ముఖ్య ఉద్దేశమని చైల్డ్‌రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్- క్రాఫ్ సమన్వయకర్త ఎ.వెంకట్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో కేవీపీ కాలనీలోని కేఎస్ఆర్‌టీ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బాలమేళా పేరుతో ఆటల పోటీలు మంగళవారం నిర్వహించారు. ఉన్నత, ప్రైమరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పి.రాంబాబు, వై.థామస్‌రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి ఆటలను నిర్వహించడం వలన విద్యార్థుల్లో ఉన్న ఒత్తిడిని జయించవచ్చునని అన్నారు. తద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని పేర్కొన్నారు. అదిగాక వారిలో దాగి ఉన్న ప్రతిభ బయటకు వస్తోందని అన్నారు. అందరూ కలిసి ఆటలు ఆడటం వలన స్నేహపూరితమైన ఆలోచనలు వస్తాయని పేర్కొన్నారు. ఆట, పాటలతోపాటు చదువుకు ప్రాధాన్యమిస్తూ, మంచి ప్రతిభతో ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. బాలలకు ఏవైనా సమస్యలు ఉన్నట్లైతే చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098, డయల్ 100, 181 ఉమెన్ హెల్ప్ లైన్ దృష్టికి తేవాలన్నారు. అనంతరం సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాలుగా ఐదు రకాల ఆటల పోటీలను చేపట్టారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్రాఫ్ జిల్లా సమన్వయకర్త జయరాజు, పీఈటీ విజయకుమార్, డీటీ శ్రీనివాసరావు, పాఠశాల సిబ్బంది జవహర్‌బాబు, జగదీశ్, శ్రీనివాసరెడ్డి, మైథిలి, పవిత్ర పాల్గొన్నారు.

ముప్పై ఏళ్లకే ముప్పు బారిన..!

దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న యువత
- బీపీ, షుగర్, క్యాన్సర్ల ప్రమాదం
- అసంక్రమిత వ్యాధులూ వ్యాప్తి చెందుతున్న వైనం
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్య నిపుణులు

గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల వ్యాధులు నిర్ణీత వయస్సు కంటే ముందుగానే ప్రజలపై దాడిచేస్తున్నాయి. వాతావరణ, ఆహార, నీటి, ధ్వని, వాయు కాలుష్యం, ఒత్తిడితో కూడిన జీవన విధానం వల్ల చిన్న వయస్సులోనే వ్యాధుల బారిన పడుతుండడంపై వైద్య నిపుణులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ) కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా 30 ఏళ్లు దాటిన ప్రజలందరికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ అసంక్రమిత వ్యాధుల బారిన పడినట్లు నిర్ధారణ జరిగింది. ప్రజలు వ్యాధుల బారినపడకుండా కొద్దిపాటి అవగాహన కలిగిఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

సర్వే జరిగిందిలా..

ఎన్‌సీడీ కార్యక్రమం గుంటూరు జిల్లాలో 2016లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా 2023 ఏప్రిల్ నుంచి 2024 జనవరి వరకు ఏఎన్ఎంలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్లి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 30 సంవత్సరాలు దాటిన వారు 17,85,931 మంది ఉన్నారు. వీరిలో 10,78,145 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. స్క్రీనింగ్ పరీక్షలు పూర్తయిన వారిలో 56,425 మంది అధిక రక్తపోటు (బీపీ)తో, 43,848 మంది మధుమేహంతో (షుగర్) బాధపడుతున్నట్లు నిర్ధారణ అయింది. షుగర్, బీపీ రెండువ్యాధులతో బాధపడుతున్న వారు 66,922 మంది ఉన్నారు. అధిక రక్తపోటు, షుగర్ వ్యాధితోపాటు, క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, టీబీ, మలేరియా, లెప్రసీ, హిమోగ్లోబిన్ శాతం, బరువు, ఎత్తు పరీక్షలను సైతం చేశారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు వివరించారు. ఉచితంగా మందులు అందించారు. మెరుగైన వైద్యసేవల కోసం సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రిఫర్ చేశారు.



ఎన్‌సీడీ కార్యక్రమ పోస్టర్లు

ఇళ్ల వద్దకే వైద్యసేవలు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల ప్రజల ఇళ్ల వద్దకే నేడు వైద్య సేవలు అందుతున్నాయి. దేశంలో ఎక్కడాలేని విధంగా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీలో అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా వైద్యులు, వైద్య సిబ్బంది నెలలో రెండుసార్లు ప్రతి గ్రామానికి వెళ్లి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు సైతం ఉచితంగా అందిస్తున్నారు. ముఖ్యంగా మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి వారు త్వరగా కోలుకునేలా వైద్యులు సేవలు అందించి, మనోధైర్యం కల్పిస్తున్నారు. మరో విప్లవాత్మక ఆరోగ్య పథకం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల ఇళ్ల వద్దే స్పెషాలిటీ వైద్యులతో ఉచితంగా పరీక్షలు చేయిస్తున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్, వ్యాధులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి స్పెషాలిటీ వైద్యులతో వైద్య సేవలు అందిస్తున్నారు.

హైరిస్క్‌వారు జాగ్రత్తగా ఉండాలి...



బీపీ, షుగర్ ఉన్నవాళ్ళు హైరిస్క్ గ్రూప్‌కు చెందిన వారు. వీరు కిడ్నీ జబ్బుల బారిన పడే అవకాశం చాలా ఎక్కువగా ఉంది. షుగర్‌సోకిన ఏడు నుంచి పదేళ్లలో కిడ్నీలు పాడవుతాయి. ఊబకాయం (అధికబరువు) ఉన్నవారు సైతం కిడ్నీ జబ్బున పడే ప్రమాదం ఉంది. జీనవశైలిలో వచ్చిన మార్పుల వల్ల నేడు 20 ఏళ్లు దాటిన ప్రతి 10 మందిలో ఒకరు కిడ్నీ జబ్బు బారిన పడుతున్నారు. షుగర్, అధిక రక్తపోటు, ఊబకాయం దీనికి కారణం. బీపీ షుగర్ ఉన్నవాళ్లు తప్పనిసరిగా కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ చింతా రామకష్ణ, సీనియర్ నెఫ్రాలజిస్ట్, గుంటూరు

జాగ్రత్తలు తీసుకుంటే షుగర్ వ్యాధి సోకదు...



షుగర్ వ్యాధి ఉందా లేదా అని ముందస్తుగా తెలుసుకోవటానికి హెచ్‌బీఏ1సీ పరీక్ష చేయించుకుంటే తెలుస్తుంది. రక్తంలో షుగర్ శాతాన్ని బట్టి వ్యాధి ఉందా లేదా నిర్ధారణ చేస్తారు. ఉదయాన్నే పరగడుపున ఏమీ తినకుండా, తాగకుండా షుగర్‌వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించినప్పుడు రక్తంలో షుగర్ 120 లోపు ఉంటే షుగర్ వ్యాధి లేనట్లే. షుగర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండి ప్రాథమిక దశలోనే జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధి సోకదు. వ్యాధి సోకినవారు భయపడకుండా ఎప్పటికప్పుడు వైద్యుల సలహాలు పాటిస్తూ క్రమం తప్పకుండా మందులు వేసుకుంటూ జీవన శైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా షుగర్ అదుపులో ఉంటుంది.

– డాక్టర్ కోగంటి కల్యాణ్ చక్రవర్తి, జనరల్ ఫిజీషియన్, గుంటూరు

క్యాన్సర్ రాకుండా...



కొన్ని రకాల క్యాన్సర్‌లు రాకుండా ముందస్తుగా వ్యాక్సిన్లు సైతం నేడు అందుబాటులో ఉన్నాయి. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించే ఆధునిక వైద్యసేవలు కూడా నేడు అందుబాటులో ఉన్నాయి. తాజా కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలి. వీటిల్లో క్యాన్సర్ కారకాలతో పోరాడే యాంటిజెంట్స్ ఉంటాయి. మాంసాహారం తీసుకునేవారు తప్పనిసరిగా వెజిటబుల్ లేదా ఫ్రూట్ సలాడ్ తినాలి. దీనివల్ల మాంసాహారంలో ఉండే క్యాన్సర్ కణాలతో సలాడ్‌లోని యాంటీజెంట్స్ పోరాడతాయి. ప్రతిరోజూ కనీసం అరగంటసేపు శారీరక వ్యాయామం చేయాలి. స్మోకింగ్, మద్యం, పాన్, గుట్కా లాంటి దురలవాట్లకు దూరండా ఉండాలి.

– డాక్టర్ ఎం.జి. నాగకిషోర్, సీనియర్ సర్జికల్ అంకాలజిస్ట్, గుంటూరు

క్రీడలకు కేంద్రంగా గుంటూరు

మేయర్ కావటి

నెహ్రూ నగర్: క్రీడలకు గుంటూరు నగరం కేంద్రంగా మారుతోందని రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించడానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. జనవరి 19, 20, 21 తేదీల్లో రాజస్థాన్‌లో నిర్వహించిన నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో మెడల్స్ సాధించిన గుంటూరు నగరానికి చెందిన కె.జగదీశ్వరి, జూనియర్స్ విభాగంలో గోల్డ్ మెడల్, జె.దేశ్ ముఖ్ సీనియర్స్ విభాగంలో బ్రాంజ్ మెడల్స్ సాధించిన క్రీడాకారును మేయర్‌ను సంపత్‌నగరలోని ఆయన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరానికి చెందిన కె.జగదీశ్వరి, జె.దేశ్‌ముఖ్ మెడల్స్ సాధించడం అభినందించతగ్గ విషయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలోని మారుమూల గ్రామాలలోని యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని చెప్పారు. దీని ద్వారా ఎంతో మంది క్రీడాకారులు గ్రామాల్లో తమ ప్రతిభను చాటుకున్నారని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అందుగుల సంతోష్, వైఎస్సార్‌సీపీ నాయకులు సాదు రాజేష్, గేదెల రమేష్, కంతేటి శ్యాం, కోచ్ లు రంగా, వలి పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న మేయర్ కావటి

ఎన్నికల విధుల్లో వలంటీర్లు పాల్గొంటే చర్యలు

కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల విధుల్లో వలంటీర్లు పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరి రివిజన్- 2024పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల విధులు నిర్వహించాలని, ఎన్నికల విధుల్లో వలంటీర్లు పాల్గొంటే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. జనవరి 22 తరువాత అందిన ప్రతి ఫారాన్ని సూపర్వైజరీ అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి ఆమోదం కోసం ఫార్వర్డు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు తగిన విధంగా అధికారులకు విధులు కేటాయిస్తున్నామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశాల్లో అందించిన ఫిర్యాదులు, అర్జీలను క్రమ పద్ధతిలో రికార్డ్ చేసి, క్షేత్ర స్థాయి పరిశీలనకు బీఎల్ఓలకు పంపాలని ఆదేశించారు. గత వారం రోజుల కాలంలో గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచి 1,143, పశ్చిమ నియోజకవర్గం నుండి 1,645 వివిధ ఫారాలు అందాయని, వాటిని ఆయా బీఎల్ఓలు ఎన్నికల నిబంధనల మేరకు పరిశీలించాలని, సూపర్వైజరీ అధికారులు పర్యవేక్షణ చేస్తారని పేర్కొన్నారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌ఓ, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, ఏఈఆర్‌ఓలు సిహెచ్.శ్రీనివాస్, డి.వెంకట లక్ష్మి, ప్రదీప్ కుమార్, సూపరింటెండెంట్‌లు సాంబశివరావు, ప్రసాద్, పద్మ, టీడీపీ నుంచి ఓంకార్, వైఎస్సార్‌సీపీ నుంచి జాన్ బాబు, బీఎస్పీ నుంచి సిహెచ్.వాసు, బీజేపీ నుంచి ఆర్.భాస్కర్‌రావు, ఆమ్ ఆద్మీ నుంచి సేవకుమార్, కాంగ్రెస్ నుండి జాని బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

గుంటూరు మెడికల్: గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నివారించవచ్చని హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా అన్నారు. క్యాన్సర్ సోకకుండా ముందస్తుగా వ్యాక్సిన్లు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా స్థానిక నల్లపాడు రోడ్డులోని ఫ్యూచర్ ఫోకస్ మహిళ జూనియర్ కళాశాలలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం, ఉచిత స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండటం ద్వారా వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చు అన్నారు. క్యాన్సర్ బాధితులకు నేడు అత్యాధునిక వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, బాధితులు ఏమాత్రం భయపడకుండా చికిత్స తీసుకోవడం ద్వారా క్యాన్సర్ రహిత జీవితాన్ని కొనసాగించవచ్చన్నారు. యువనారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్, హోప్‌విన్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు, ముఖ్యంగా కౌమార దశలో ఉన్న విద్యార్థినులకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, ఆల్ట్రాసౌండ్ పరీక్షలు చేసి అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. తమ సంస్థ అందిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హోప్‌విన్ హాస్పిటల్ మేనేజర్ సి.హెచ్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



శతాధిక కవి సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

పాత గుంటూరు: 'పుణ్యభూమి నాదేశం నమో నమామి' శతాధిక కవి సమ్మేళనం ఈ నెల 11వ తేదీ నిర్వహించనున్నట్లు ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ సౌత్ జోన్ అధ్యక్షుడు రామరాజు శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శ్రీనివాసరావు కార్యాలయంలో సమ్మేళనం పోస్టర్ మంగళవారం ఆవిష్కరించారు. భారత కోకిల సరోజినీ నాయుడు జయంతి పురస్కరించుకొని నేటి యువతలో దేశభక్తిని, తెలుగుభాషపై ఆసక్తిని, పర్యావరణంపై అవగాహన కలిగించేందుకు కార్యక్రమాన్ని విజయవాడంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మల్లెతీగ, నవభారత నిర్మాణ సంఘం, భారతీయ జీవిత బీమా సంస్థ, గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్టు, స్టేట్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమ నిర్వాహకులు మల్లెతీగ వ్యవస్థాపకుడు కలిమిశ్రీ మాట్లాడుతూ రోజంతా జరిగే కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పది ఉత్తమ కవితల్ని ఎంపిక చేసి అదే రోజు సాయంత్రం జరిగే సభలో ఒక్కొక్క కవితకు రూ.1116 నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికతో సత్కరిస్తామన్నారు. పాల్గొన్న ప్రతి కవికీ జ్ఞాపిక, ప్రశంసాపత్రం ఉంటుందన్నారు. విజయవాడ బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయ నూతన ఆడిటోరియంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర రచయితల సంఘం కార్యదర్శి సయ్యద్ జానీబాషా, చొప్పా రాఘవేంద్రశేఖర్, కుర్రా సురేష్ బాబు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరించిన శ్రీనివాసరావు, కలిమి శ్రీ

సెరామిక్ ఇంప్లాంట్‌తో మోకీలు మార్పిడి

గుంటూరు మెడికల్: మోకీలు సమస్యతో బాధపడుతున్న ఓ రోగికి గుంటూరులోని అమృత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అత్యాధునిక పద్ధతిలో ఆపరేషన్ చేసినట్లు ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ మద్ది వినోద్‌కుమార్ తెలిపారు. స్థానిక కొత్తపేటలోని అమృత హాస్పిటల్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుంటూరుకు చెందిన 82 ఏళ్ల శ్రీనుకు మూడేళ్లుగా తీవ్రమైన మోకీలు సమస్య ఉందన్నారు. సోమవారం రోగికి సెరామిక్ ఇంప్లాంట్ అమర్చి మోకీలు మార్పిడి చేశామన్నారు. ఇప్పటివరకు గోల్డ్, టైటానియం ఇంప్లాంట్‌లు మాత్రమే మోకీలు మార్పిడి కోసం వినియోగించే వారని, వీటి లైఫ్ కేవలం 20 సంవత్సరాలు మాత్రమేనని పేర్కొన్నారు. జీవితాంతం మోకీలు సక్రమంగా పని చేయాలంటే సెరామిక్ ఇంప్లాంట్ ఉపయోగించడమే సరైన విధానమని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో తొలి సారిగా సెరామిక్ ఇంప్లాంట్ అమర్చి మోకీలు మార్పిడి సర్జరీ తమ ఆసుపత్రిలో చేశామని వెల్లడించారు. సెరామిక్ ఇంప్లాంట్ అమర్చడం ద్వారా ఆపరేషన్ అనంతరం ఎలాంటి మెటల్ ఎలర్జీ ఉండదన్నారు.



డాక్టర్ మద్ది వినోద్‌కుమార్

ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉన్న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (డీఎల్‌టీసీ)లో నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ కల్పిస్తున్నట్లు డీఎల్‌టీసీ అసిస్టెంట్ డైరెక్టర్ బి.శివ సత్యసాయి వరప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీఎల్‌టీసీలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతతో పాటు విద్యార్థులకు అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఎంఎస్ ఆఫీస్ కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ కల్పించి, ఉద్యోగావకాశాలు చూపిస్తామని తెలిపారు. టెన్త్ ఆపై విద్యార్హత ఉన్న 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు అభ్యర్థులు తమ ప్రతినిధులు ఆర్‌పీవీ మణిదీప్ (80746 07278), షేక్ మస్తాన్ వలీ (97046 68909) నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బాలికలతో వాచ్‌మెన్ అసభ్య ప్రవర్తన

గుంటూరు రూరల్: అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న వ్యక్తి చిన్నారులతో అసభ్యకరంగా ప్రవర్తించి, చిన్నారుల తల్లిదండ్రులకు విషయం తెలియటంతో పరారైన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా మార్కాపురం ప్రాంతానికి చెందిన పొంగులూరి ప్రభాకర్ గత మూడు నెలల క్రితం స్తంభాలగరువు శ్మశాన వాటిక సమీపంలోని తురకపాలెం రోడ్డులోగల ఒక అపార్ట్‌మెంట్‌లో తన భార్యా కొడుకుతో కలిసి వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటాడు. ప్రతి రోజు సాయంత్రం వేళల్లో చిన్నారులు అపార్ట్‌మెంట్ ఆవరణలో ఆడుకుంటూ ఉంటారు. చిన్నారులతో ఆడుకుంటున్నట్లుగా ఉంటూ అదే అపార్ట్‌మెంట్‌లోని ఒక బ్లాక్‌కు చెందిన 3వ తరగతి చదువుతున్న చిన్నారిని, మరో బ్లాక్‌కు చెందిన మూడో తరగతి చదువుతున్న కొందరు చిన్నారులను సాయంత్రం సమయంలో అపార్ట్‌మెంట్ పైకి తీసుకెళ్లి వారితో అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. ఎవ్వరికీ చెప్పకుండా చిన్నారులకు డబ్బులు, తినుబండారాలు ఇచ్చేవాడని సమాచారం. ఇదిలా ఉండగా చిన్నారుల జేబుల్లో డబ్బులుండటంతో తల్లిదండ్రులకు అనుమానం వచ్చి ప్రశ్నించగా చిన్నారులు జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పారు. విషయం తెలుసుకున్న వాచ్‌మెన్ పరారీలో ఉన్నాడు. సంఘటన స్థలికి చేరుకున్న నల్లపాడు పోలీస్ స్టేషన్ పోలీసులు విచారణ చేపట్టగా వాచ్‌మెన్ గత ఆదివారం కూడా చిన్నారులను ఇదే విధంగా అపార్ట్‌మెంట్‌పైకి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడని తెలిసింది. ఘటనపై చిన్నారుల తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

గుంటూరు ఈస్ట్: పేకాటాడుతున్న నలుగురిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. అరండల్‌పేట 10వ లైనులో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వీరి నుంచి రూ.48 వేలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన

లక్ష్మీపురం: సైబర్ నేరగాళ్ల నుంచి పూర్తి స్థాయిలో రక్షణగా ఇంటర్నెట్‌ని సురక్షితంగా వినియోగించటంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సీనియర్ ఇంజినీర్ విశ్లేషకులు ఎస్.సదాశివం అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం అంతర్జాల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక కాలంలో ఎలక్ట్రానిక్ ఉపకరణాలు అంతర్జాలం యాప్‌లను వినియోగించనిదే రోజు గడవని పరిస్థితి ఉందన్నారు. జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానుల హరి, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ అవగాహన లేకుండా అనవసరంగా సామాజిక మాధ్యమాలను వినియోగిస్తుటం వలన చాలా మంది ఇబ్బందుల్లో పడుతున్నారన్నారు.

సెక్యూరిటీ కాంట్రాక్టర్‌కు నోటీసులు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ప్రైవేటు సెక్యూరిటీ కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు. ఓపీ విభాగంలో మంగళవారం తనిఖీ చేశారు. రోగుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నూతనంగా ఏర్పాటు చేసిన 11 ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్లలో తగినంత సిబ్బందిని సెక్యూరిటీ కాంట్రాక్టర్ నియమించలేదన్నారు. పార్కింగ్‌ను అస్తవ్యస్తంగా చేస్తున్న మరో కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఆస్పత్రి ఓపీకి ప్రతిరోజు రోగులు మూడు నుంచి నాలుగు వేల మంది వస్తున్నారని, వారితో పాటు వారి సహాయకులు కూడా మరో నాలుగు వేలమందికి పైగా వస్తున్నట్లు వెల్లడించారు. ఓపీ కేంద్రంలో పరిశీలన చేసినప్పుడు కౌంటర్ల వద్ద కేవలం ఐదుగురు డీఈఓలు మాత్రమే విధుల్లో పని చేస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. 11 రిజిస్ట్రేషన్ కౌంటర్‌లలో 11 ప్రింటర్లు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. కాంట్రాక్టర్ సిబ్బందిని, ప్రింటర్లను అందుబాటులో ఉంచకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పారు. ప్రజలను ఇబ్బంది పెట్టడమే కాకుండా ఆసుపత్రికి చెడ్డ పేరు వచ్చే విధంగా కాంట్రాక్టర్ ప్రవర్తిస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. ఇకనైనా కాంట్రాక్టర్లు పద్ధతులు మార్చుకుని ఆసుపత్రికి వచ్చే వారికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశ సజని పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ వార్షిక అంచనా బడ్జెట్‌కు ఆమోదం

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థ 2024–25 ఆర్థిక సంవత్సర అంచనా బడ్జెట్‌కు సంస్థ పర్సన్ ఇన్‌చార్జ్, జేసీ జి.రాజకుమారి ఆమోదం తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్లో రాజకుమారి అధ్యక్షతన జిల్లా గ్రంథాలయసంస్థ బడ్జెట్‌పై సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.47,72,07,425 సవరణ బడ్జెట్‌తో పాటు 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.61,07,16,262 అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. సమావేశంలో డీఈఓ పి.శైలజ, డీపీఓ కుసుమ శ్రీదేవి, వయోజన విద్య డెప్యూటీ డైరెక్టర్ బి.జగన్‌మోహన్ రావు, ఐ అండ్ పీఆర్ డెప్యూటీ డైరెక్టర్ అబ్దుల్ రఫీక్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ఝాన్సీలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఎం.సీతారామయ్య పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



నగరంపాలెం: కేంద్ర కార్మిక సంఘాలు, ఐదు వందలకు పైగా రైతు సంఘాలు ఐక్యంగా ఈనెల 16వ తేదీన దేశ వ్యాప్త గ్రామీణ బంద్ / పారిశ్రామిక సమ్మెకు పిలుపునిచ్చినట్లు ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణ మూర్తి తెలిపారు. కొత్తపేట సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏఐటీయూసీ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ఎ.అరుణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ దేశ వ్యాప్త సమ్మెను ఏఐటీయూసీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో మోదీ అధికారంలోకి వచ్చాక ప్రజలు, రైతులు, కార్మికులు, నిరుద్యోగ యువత సమస్యలతో అల్లాడిపోతున్నారని ఆరోపించారు. అనేక పోరాటాలు చేపట్టిన కేంద్రానికి ఏమాత్రం స్పర్శలేదని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు జంగాల అజయ్ మాట్లాడుతూ ఏపీకి బీజేపీ చేస్తున్న అన్యాయంపై ప్రధాన, ప్రాంతీయ రాజకీయ పార్టీలు ప్రశ్నించకపోవడం శోచనీయమని అన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుపై ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ అమిత్‌షాను గట్టిగా అడగలేకపోతున్నారని ఆరోపించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, నాయకులు చల్లా చినఆంజనేయులు, రావుల అంజిబాబు, సురేష్, బందెల రవికుమార్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కాకుమానువారితోటలో నివాసం ఉండే ఎం.మహేష్(38) అప్పుల బాధతో మంగళవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు.